
ఈ వారం కథ

# మా అమ్మాయి

– ఎస్. జయ



కాలింగ్‌బెల్ అదే పనిగా మోగుతోంది.

పిచ్చుక అరుపు కిచకిచ వినడానికి ఆహ్లాదకరంగా వుంటుందని ఆ ధ్వని వచ్చే కాలింగ్‌బెల్ పెట్టాం.

బెల్ స్విచ్ అదే పనిగా నొక్కితే, గొంతు నులిమేస్తున్న పిచ్చుక అరుపులా వుంటుంది. ఈ శబ్దానికి నా మనసు విలవిల్లాడుతుంది. తలుపులు తీయడానికి పరుగులు తీస్తాను.

ఆ బెల్ నొక్కే తీరులోనే వచ్చింది ఎవరో తెలుస్తూనే వుంది.

కరుణ కాలేజీ నుంచి వచ్చింది. ఎప్పుడూ ఇంతే అనుకుంటూ కోపంతో తలుపులు తెరిచాక–

లోపలికి అడుగు పెట్టిందో లేదో ఒక్క ఉదుటన నన్ను ఎత్తుకొని గాల్లోకి లేపి దించింది. నా చెంపను తన చెంపతో నత్తుకుని వదిలేసింది.

"ఈ రోజు భలే తమాషా జరిగింది తెలుసా?!"

బిగ్గరగా నవ్వింది.

"సల్ఫ్యూరిక్ యాసిడ్‌ని– ఈ రోజు ఎట్లా ఏడిపించానో" అంది.

"అయితే మాత్రం, బెల్ అంతలా నొక్కాలా" అన్నాను కోపంతో.

"సారీ మమ్మీ! ఆపకుండా స్విచ్ నొక్కడం నీ కిష్టముండదని తెలుసు, కానీ... నా కెంత ఆనందంగా, సంతోషంగా వుందో ఈ రోజు"

"నీకు సంతోషంగా వుండంది ఎప్పుడు?" అన్నాను.

"నేనేం చేశానని అంత చిరాకు" బుంగ మూతి పెట్టుకుని విసురుగా పుస్తకాల బేగ్‌ను టేబుల్ మీదకు విసిరేసింది.

"నాకేం కోపం రాలేదు. ముందు నీ మాటలే వింటాను, కాదు విజయాలే వింటాను. చెప్పు" అన్నాను. కరుణ బుగ్గ మీద ఓ ముద్దిచ్చాను సముదాయింపుగా.

నా కళ్ళల్లోకి సూటిగా చూసి, "ఏం లేదులే" అని నా చేతుల్లోంచి విదిలించుకుంది.

"సల్ఫ్యూరిక్ యాసిడ్‌ను ఏడిపించావన్నావు. ఎందుకు, ఎట్లా" అన్నాను ఉత్సుకత ప్రకటిస్తూ

"నిజంగా నీకు వినాలని వుందా? లేక నన్ను బుజ్జగించడానికా?" అని నా వైపు పరిశీలనగా చూసింది.

నాకే మాత్రం ఆసక్తి లేకపోయినా, తన కోసం వింటానంటే చెప్పదు. ఎలాగైతేనేం, తన మాటలు మనస్ఫూర్తిగా వినాలనుకుంటున్నానని ఒప్పించగలిగాను. ఆ కళ్ళల్లో కోపం స్థానే వెలుగు ప్రవేశించింది. ముఖమంతా లాస్యంతో తొణికిసలాడింది.

"నిన్నటి సంగతి కూడా చెబితే బాగుంటుంది" అంది. ఆసక్తి కలిగించడానికి ఒక మాట చెబుతుంది. తరువాత దానికి ముందూ వెనుకా ఓ పెద్ద కథ అల్లుతుంది. ఆమె కబుర్లు చెప్పే తీరే అంత.

ఇలాంటి సందర్భాల్లో నేను నీరసంగా ముఖం పెట్టినా, "నేనో మంచి విషయం చెబుతాను, నీ పేర కథ రాసుకోవచ్చ"ని నన్ను ఊరిస్తుంది.

ఏమాట కామాటే చెప్పుకోవాలి. మా ముగ్గురిలో ఎవరికి ఏ కొంచెం కోపం వచ్చినా మిగిలిన ఇద్దరం వెంటనే రాజీబేరాలకు దిగుతాం.

నేను ఆసక్తి కనబరిచేసరికి కరుణలో ఉత్సాహం కలిగింది. కాలేజి కబుర్లు చెప్పడం మొదలుపెట్టింది.

శరవేగంగా గలగలా ప్రవహిస్తాయి కరుణ కబుర్లు. ఆ కబుర్ల ప్రవాహంలో కొట్టుకుపోతున్న నాకు ఒక్కోసారి గిలిగింతలు కలిగితే మరోసారి ఉక్కిరి బిక్కిరి అవుతాను. ఇంకోసారి ఆందోళన కలిగి వణుకు పుడుతుంది.

అప్పుడు మా అమ్మాయిని చూస్తే నా కలలు నిలువెత్తు రూపుకట్టి నా ముందు నిలబడినట్టు వుంటుంది. భవిష్యత్తు నన్ను వెచ్చగా స్పర్శిస్తున్నట్టు వింత అనుభూతి కలుగుతుంది.

"మమ్మీ! నిన్న బాటనీ క్లాస్ బయట నిల్చొని అనూరాధ కోసం చూస్తున్నాను. స్టాఫ్‌రూంకు వెడుతున్న సల్ఫ్యూరిక్ యాసిడ్ (కెమిస్ట్రీ లెక్చరర్)ను చూసి నవ్వుతూ విష్ చేశాను.

'నీ నవ్వు బాగుంటుంది' అన్నాడు.

'పెద్దల ఆశీర్వాదాలు వుంటే నవ్వుతూ వుంటామండీ' అన్నాను. చిన్నబుచ్చుకొని వెళ్ళాడు" చెప్పింది కరుణ.

"ఎందుకు చిన్నబుచ్చుకోవడం" అడిగాను అర్థంకాక.

"నీ నవ్వు బాగుంటుందని అమ్మాయిలకు చెబితే సిగ్గుపడాలని ఈ లెక్చరర్ కోరుకుంటాడు. అప్పుడు ఆయన తన ఫార్టీలో ఓ ఫిఫ్టీస్ తగ్గినట్టు ఫీలయి యంగ్‌మాన్‌గా ఉషారుగా వెళతాడు.

నేను సిగ్గుపడకపోగా, 'మీరు పెద్దలు' అని గుర్తు చేశాను కదా, అందుకు" అని చిలిపిగా నవ్వింది.

నాకూ నవ్వొచ్చింది.

"ఈ రోజు క్లాసులో నేను అనూ కలిసి కెమిస్ట్రీ ప్రాబ్లమ్స్ చేసుకుంటున్నాం. 'ఎప్పుడూ మాటలేనా?' అని కోప్పడ్డాడు. 'ప్రాబ్లమ్స్ చేసుకుంటున్నామండీ' అని నవ్వాం. 'ఎందుకు నవ్వుతారు' అన్నాడు. 'వి ఆర్ లాఫింగ్ అట్ యూ' అన్నాను చిన్న గొంతుతో. ఫస్ట్ బెంచీలో కూర్చుంటానా?! నేను లెక్చరర్‌కు ఏదో చెప్పానని అందరూ అనుకుంటారు. కాని, నేనన్నది క్లాసులో ఎవరికీ వినబడదు. ఆ మొహంలో మారే రంగుల్ని చూసి స్టూడెంట్స్‌కు సస్పెన్స్. నాకెంత థ్రిల్లింగ్‌గా వుందో"

"ఏమిటమ్మా ఇదంతా" అన్నాను చిరుకోపం నటిస్తూ.

"ఈ లెక్చరర్ మీద మా అమ్మాయిలకు చాలా కంప్లైంట్స్ వున్నాయి మమ్మీ" అంటూ మరిన్ని వివరాలు నా ముందు పెట్టింది.

"నువ్వు అందంగా వున్నావు, నీ నవ్వు బాగుంటుందని అంటాడు. అమ్మాయిలు సిగ్గుపడితే, ఎప్పుడూ ఏదో ఒకటి అట్లా కామెంట్ చేస్తూవుంటాడు. కొందరు పిచ్చివాళ్ళుంటారు. లెక్చరర్ తమను పలకరించడమే గొప్పగా ఫీలవుతారు. ఆ మాటల నిచ్చెనలెక్కి ఊహాలోకాల్లో విహరిస్తూ దగా పడుతుంటారు.

లెక్చరర్ మాటలు వినడం ఇష్టంలేని అమ్మాయిలు దూరంగా తప్పుకుంటే, క్లాసులో వాళ్ళనే ఎక్కువగా కొశ్చెను అడుగుతాడు.

ఫస్ట్ బెంచీల్లోనే అమ్మాయిలంతా కూర్చుంటామా? అమ్మాయిల కళ్ళల్లోకి చూస్తూ పాఠాలు చెబుతాడని, తలలు వంచుకొని పాఠాలు వింటారు. అమ్మాయిల ముఖం మీద చిటిక వేస్తూ ప్రశ్నలు అడుగుతాడు. తల వాల్చుకుని వున్న అమ్మాయిలు ఉలిక్కిపడి, గాబరా పడిపోయి జవాబు చెప్పలేకపోతారు. అప్పుడు ఏమంటాడో తెలుసా?!

'అమ్మాయిలు ఎందుకు ఎంపిసి గ్రూపు తీసుకుంటారో అర్థం కాదు ఇంట్లో వంటలు, కుట్లు నేర్చుకోక. సీట్ల కోసం, ఉద్యోగాల కోసం పోటీకి వస్తార'ని హేళన చేస్తాడు.

అబ్బాయిలంతా గొల్లున నవ్వుతారు.

ఆ అమ్మాయి కళ్ళల్లో నీళ్లు.

నేను క్లాసులో తలవంచుకుని కూర్చోను. ప్రశ్నలకు జవాబిస్తుంటానా! ఎట్లాగైనా నన్ను బెదరగొట్టాలని నన్ను మాట్లాడకుండా చేయాలని చూస్తున్నాడు.

అందుకే నాకూ ఈ లెక్చరర్‌ను ఓ పట్టు పట్టాలనే అనిపించింది" లంది.

ఆ మాటల్లో ఎంతో ఆత్మస్థైర్యం, పట్టుదల కనిపించాయి.

నా ముందున్నది నా పదిహేనేళ్ళ కూతురేనా అనిపించింది ఒక్క క్షణం. ఇంటర్‌లో జాయిన్ అయి ఆర్నెల్లు కాలేదు, ఇన్ని విషయాలు ఎట్లా తెలుసుకుంది అనుకున్నాను.

చేదు సంఘటనలు నా కూతురు అనుభవాల్లోకి రాకూడదని నా తల్లి మనసు ఓ మూల ఆరాటపడింది.

నిజమే, మనం నడుస్తున్న బాటలో ఎన్నో ముళ్ళున్నాయి. జాగ్రత్తగా నడిచి వెళ్ళమని సలహా ఇవ్వలేకపోయాను.

నేటి అమ్మాయిలు బతుకు బాటలోంచి ముళ్లను ఊడ్చిపారేసే సాహసం చేస్తున్నారు. అందులో కరుణ వున్నందుకు నాలోని అమ్మ మనసు గర్వపడింది.

* * *

కరుణ ఎనిమిదో క్లాసులో వుండగా ఒక రోజు

"మమ్మీ ఆ రోజు నుంచి నేను బొట్టు పెట్టుకోను" అంది.

"నీ ఇష్టం" అన్నాను.

"ఎందుకు అని అడగవేం" రెట్టించింది.

"ఎందుకు?" నవ్వుతూ అడిగాను.

"నిన్న క్లాసులో మా సైన్సు టీచరు అమ్మాయిల్ని నిల్చోబెట్టి యూనిఫాం సైని, బెల్టుని నడుం చుట్టూగట్టిగా బిగించి పెట్టుకోమంది. ఆడపిల్లకు నడుం సన్నగా వుంటే అందమట. బెల్టు బిగించి పెట్టుకోకపోతే లావుగా వికారంగా వుంటారని చెప్పింది."

బెల్టు గొడవకు, బొట్టుకు సంబంధమేమిటో అర్థం కాలేదు నాకు. అదే అడిగాను.

"మా క్లాసులో ఇద్దరు ముస్లిం అమ్మాయిలు, ఒక క్రిస్టియన్ అమ్మాయి వుంది. బొట్టు పెట్టుకున్న వాళ్ళంతా హిందువులని వాళ్ళను లేపి బెల్టు బిగించి పెట్టుకోమంది. బొట్టు లేకపోతే నాకు అలాంటి సలహాలు ఇవ్వదు కదా!" అంది.

టీచరు సంకుచితంగా ప్రవర్తించడం జుగుప్స కలిగించినా, దాన్నే మా అమ్మాయి మరొకందుకు ఉపయోగించుకోవడం చూసి ఆశ్చర్యపడ్డాను.

మా అమ్మాయి అనుకున్నట్టుగానే ఆ టీచర్ మరోసారి క్లాసులో నిల్చోబెట్టి అలాంటి సలహాలు ఇవ్వలేదు.

పదో తరగతి ప్రారంభ దినాల్లో కరుణకు మరో గొడవ ఎదురైంది. ఇది కొంచెం పెద్దదే. స్కూలు నుంచి వస్తూనే, స్కూలు బ్యాగ్, వాటర్ బాటిల్ భుజాన వేలాడుతూనే వున్నాయి.

"మమ్మీ, రేపు శనివారం నా బ్లాక్ టీ షర్ట్, జీన్స్ ప్యాంటు ఇస్త్రీ చేయించు" అంది. అప్పుడే గుర్తొచ్చినట్టు తొందర తొందరగా.

"ఇంట్లోకి అడుగు పెట్టావో లేదో రేపటి గురించి ఎందుకు ఆలోచన. ముందు యూనిఫాం మార్చుకో, పోయిన శనివారం ప్యాంటు, షర్టే కదా వేసుకుంది. రేపు బ్లూ మిడ్డీ, ఎల్లో టాప్ వేసుకెళ్ళు" అని చెప్పాను.

కరుణ చదివిన స్కూల్లో ఐదు రోజులు యూనిఫాం ధరిస్తే, శనివారం అమ్మాయిలంతా రంగు రంగుల వెరైటీ డ్రెస్సులు వేసుకొని స్కూలుకు వెడతారు.

మిడ్డీ, పంజాబీ డ్రెస్, ఫ్రాక్, ప్యాంటు, షర్టు నాలుగైదు రకాల డ్రెస్సులు వున్నాయి కరుణకు. ఒక్కో శనివారం ఒక్కో డ్రెస్ వేసుకునేది.

"పోయిన వారం నా డ్రెస్ గురించి చాల గొడవ జరిగింది. నీకు చెప్పలేదు కదూ!?"

"లేదు" అన్నాను.

"ఇంగ్లీషు సబ్జెక్టుకు వచ్చే మా క్లాస్ టీచర్ నన్ను స్టాఫ్ రూంకు పిలిపించి చీవాట్లు పెట్టింది.

టెన్త్‌క్లాసుకు వచ్చినా ఇంకా ప్యాంటు, షర్టేమిటని కోప్పడింది.

ఇంటో టీచరేమో, 'ఇది గర్ల్స్ స్కూలు అమ్మాయ్! మగ రాయుడిలా ఆ డ్రెస్సేమిటి? మీ అన్నయ్య డ్రెస్సులు వేసుకోవాలని నీ కంత మోజుగా వుంటే, ఇంట్లో ఆదివారాలు వేసుకో' అంది.

'ఈ డ్రెస్ నాదేనండి. నాకు అన్నయ్యలు లేరు' అన్నాను.

'ఈ పిల్ల భలే పొగరుమోతు పిల్ల. ఎట్లా కళ్ళల్లోకి సూటిగా చూస్తూ జవాబిస్తోందో చూడండి. ఆ పిల్ల నిలబడే తీరు చూడండి.'

'ఏమిటి? మీ అమ్మ నీ కెప్పుడూ చెప్పలేదా? ఆడపిల్లవు. భుజాలు వంచి నిలబడాలని తెలీదు' అని ఒక టీచర్ అంటే, మరో టీచరు 'ఇంకా ఎల్‌కెజి పిల్లకు మల్లే ఆ బాబ్డ్ కటింగ్ ఏమిటి? జడలు వేసే తీరిక కూడా మీ అమ్మకు వుండదా, ఆవిడకు సోషల్ వర్క్ తప్ప పిల్లను ఎట్లా పెంచాలో తెలీదా?' అంది.

ముగ్గురు, నలుగురు టీచర్లు కలిసి నన్ను విమర్శిస్తుంటే నాకు చాలా కోపం వచ్చింది.

గట్టిగానే వాళ్ళకు సమాధానం చెప్పానుకో.

'టీచర్, జడలు పెంచుకొని పేలు పడకుండా, జుట్టు రాలకుండా, ఇంకా పొడవు ఎట్లా పెంచుకోవాలా అని అందరూ ఎంత కష్టపడుతుంటారో నాకు తెలుసు. హేర్ కటింగ్ వల్ల ఏ చీకూచింత లేకుండా ఎంత హాయిగా వుంటుందో మీ కెవరికీ తెలీదు. అందుకని మీ సలహా పాటించను. డ్రెస్ విషయంలోనూ అంతే. ఇక మా అమ్మ గురించి పిల్లల్ని హాయిగా పెరగనివ్వాలి కాని, ఒకరు పెంచడమేమిటి అంటుం'దని అన్నాను. ఒక్క నిముషం ఎవరూ మాట్లాడలేదు. 'నేను నా క్లాసుకు వెళ్ళొచ్చాండి' అని మా క్లాస్ టీచర్‌ను అడిగి బయటపడ్డాను.

ఇక నుంచి ప్రతి శనివారం ప్యాంటు, షర్టే వేసుకుంటాను. టీచర్లు ఎన్ని రోజులు గొడవ చేస్తారో చూస్తాను" అంది.

* * *

కరుణ స్నానం చేసి, తన కిష్టమైన తెల్లని పంజాబీ డ్రెస్ వేసుకొంది. రిలాక్స్ అవుతూ టేప్ రికార్డర్ ఆన్ చేసింది. ట్రేసీ చాప్‌మాన్ పాటకు తన గొంతు కలిపి పాడుతోంది. అదే సమయంలో ఆ రాత్రి తను చదువుకోవాల్సిన బుక్స్, నోట్స్ టేబుల్ మీద పెట్టుకుంది.

ఈలోగా నా వంట పనీ పూర్తయింది.

"కన్నా! ఇప్పుడే భోం చేస్తావా? కాసేపాగి తింటావా" అని అడిగాను.

"ఇప్పుడే భోంచేస్తాను మమ్మీ. మనసు అశాంతిగా వుంది. నీతో ఇంకా కబుర్లు చెప్పుకోవాలని వుంది" అంటూ పరుగు నడకతో డైనింగ్ టేబుల్ దగ్గరికి వెళ్ళి, కూచుంది.

కరుణ ఏ విషయాన్నైనా ఓ పట్టాన వదిలిపెట్టదు. గంటల తరబడి ఆలోచిస్తుంది. ప్రతిదాన్ని సీరియస్‌గా పట్టించుకునే కరుణ తత్వం ముచ్చటేసినా, లోపల ఆందోళన పడుతుంటాను.

"కుమ్మరి కుండలు చేసినట్టు కుటుంబం మనుషుల్ని స్త్రీలుగా, పురుషులుగా మలుస్తోంది అనుకుంటాం కదా! మన విద్యాలయాలు ఫ్యాక్టరీల్లాంటిని కదూ!? మా క్లాసు రూంలో ఒక్క అమ్మాయికి అమ్మాయిలా వుండమనిచెబితే, క్లాసులో వున్న నలభై, యాభై మంది అట్లా తయారవుతారు" అంది.

కరుణ చక్కని విశ్లేషణకు ఆనందం కలిగినా ఆ మాటల్లో ధ్వనించిన ఆవేదనకు చెలించిపోయాను.

స్కూలు స్థాయి దాటేసి కాలేజీలో చేరింది. స్వేచ్ఛగా వుంటుంది. సమస్యలుండవు అనుకున్నాను. కాని చిన్న చిన్న గులకరాళ్ళు, గుట్టలు తరువాతే పెద్ద కొండలు, పర్వతాలు ఎదురైనట్టు కరుణ పెద్ద సమస్యల్లోకి ప్రయాణిస్తోంది అనిపించింది.

నా గుండెలో అలజడి.